www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 ఏప్రిల్ 2023

ప్రాంగణ ఎంపికల్లో 55 మందికి ఉద్యోగాలు

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

పీలేరు: పట్టణంలోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరిగిన ప్రాంగణ ఎంపికలో 55 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమ, మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇమ్మెన్స్ ఫేర్' సంస్థ హెచ్‌ఆర్ వినీత్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాత పరీక్షకు 190 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 91 మంది గ్రూప్ డిస్కషన్స్ కు అర్హత సాధించారని చెప్పారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల్లో 55 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.3.50 లక్షలు వేతనం అందుతుందని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్ మెంట్ ఇంచార్జ్ సత్యరాజ్, కేశవ గుప్త పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు గ్రహణం



- రూ.145 కోట్ల మ్యాచింగ్ గ్రాంటు పేరుతో బిజెపి తొండాట
- ముద్దనూరు-ముదిగుబ్బ లింకు లేఖ పేరుతో కాలయాపన
- పాత అలైన్‌మెంట్ రైల్వేలైన్ పనుల నిలిపివేత
- కడపలో సూపరింటెండెంట్ కార్యాలయం ఎత్తివేత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులకు గ్రహణం పట్టింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఫిఫ్టీ ఫిఫ్టీ మ్యాచింగ్ గ్రాంట్లతో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా 13 కి.మీ మేర పనులు పూర్తి చేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ మరణానంతరం రైల్వేలైన్ పడకేసింది. 2022-23 కేంద్ర బడ్జెట్‌లో రూ.289 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.10 లక్షల

పెండ్లిమర్రి వద్ద కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

చొప్పున అత్తెసరు కేటాయింపులు చేసింది. రైల్వేలైన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని తరలించడం, అతి స్వల్ప కేటాయింపులను బట్టి పరిశీలిస్తే కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులను కోల్డ్ స్టోరేజీలో పడేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయలేదనే పేరుతో కేంద్ర బిజెపి సర్కారు తొండాట ఆడుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన మంత్రి మోదీని గద్దెదించండి...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో వామ పక్షాలు ఈ నెల 14 నుంచి 30 వరకు చేపట్టిన ప్రచార భేరిని ఆదరించాల్సిన అవసరం ఏర్పడింది. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులకు బిజెపి బ్రేకులు వేస్తోంది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ముద్దనూరు- ముదిగుబ్బ రైల్వేలైన్ లింకుతో ఖర్చు తగ్గు తుందనే పేరుతో రాసిన లేఖను వాడుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వేలైన్ పనులను గాడిలో పెట్టాల్సిన బాధ్యతను కేంద్ర ప్రభు త్వం తీసుకోవాలి. 2017 నుంచి 2023 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పట్టించుకున్న దాఖ లాల్లేవు. 2006లో కీ.శే మాజీ ముఖ్య మంత్రి వైఎస్ హయాంలో 50 శాతం రైల్వేలైన్ పనుల ఖర్చు భరిస్తామని ముందుకు రావడంతో రైల్వేలైన్ పట్టాలకు ఎక్కింది. వైఎస్ మరణానంతర ప్రభుత్వాలు చొరవ చూపకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గత నాలుగేళ్లుగా అత్తెసరు కేటాయింపులతో ముందుకు సాగని విషయం తెలిసిందే. 2022-23 బడ్జెట్‌లోనూ రూ.289 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.10 లక్షలు మాత్రమే కేటాయించింది. కేంద్ర బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే రైల్వేలైన్ ఇప్పట్లో పూర్తి కావడం కష్టమేనని తెలుస్తోంది. ఇదిలాఉండగా కడప నుంచి పెండ్లిమర్రి, నందిమండలం మీదుగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, చిన్నమండెం, వాయల్పాడు, కర్నాటకలోని మాడగట్ట నుంచి కోలార్ వరకు రైల్వేలైన్ అలైన్‌మెంట్‌కు రూప కల్పన చేసిన సంగతి తెలిసిందే. రెండుజోన్ల పరిధిలో 257 కి.మీ మేర నాలుగు దశల రైల్వేలైన్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21 కిలోమీటర్ల మేర పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. నాలుగు దశల్లో భాగంగా మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు సుమారు 21 కి.మీ. వరకు 10 శాతం రైల్వేలైన్ పనులు పూర్తి చేసింది. డెమోట్రయల్‌రన్ నిర్వహించింది. 2013 భూసేకరణ చట్టం కింద సౌత్‌సెంట్రల్, సౌత్ వెస్ట్రరన్ జోన్లు మిగిలిన భూసేకరణ, సర్వే పనుల్ని పూర్తి చేయాల్సి ఉంది. సౌత్ సెంట్రల్‌జోన్ కర్నాటక రాష్ట్ర పరిధిలో ఉండడంతో ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. 2017-18లో రూ.175 కోట్లు, 2018-19, 2019-20 బడ్జెట్‌లో అత్తెసరు నిధులు కేటాయింపుల నేపథ్యంలో ముందుకు సాగని సంగతి తెలిసిందే. 2022-23 బడ్జెట్‌లో రూ.289, 2023-24 బడ్జెట్‌లో సుమారు రూ.10 లక్షలు కేటాయింపులు చేసింది. కేంద్రం రూ.145 కోట్లు, రాష్ట్రం రూ.145 కోట్లను కేటాయించాల్సి ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిధుల లేమి కారణంతో కడప జిల్లాలోని ముద్దనూరు, అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ రైల్వేలైన్ కూడలి వరకు సుమారు 82 కిలోమీటర్ల మేర పనులు చేపడితే తక్కువ ఖర్చుతో బెంగళూరు లైన్ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని లేఖ రాసింది. నిధుల లేమి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయలేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులను అటకెక్కించింది. కడప కేంద్రంగా రైల్వేలైన్ పనుల్ని పర్యవేక్షిస్తున్న ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయాల్ని తరలించింది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సిబ్బందిని బదిలీ చేసినట్లు తెలుస్తోంది. కడప-బెంగళూరు రైలుమార్గం కలగా మిగిలిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మేధావులు, బుద్ధిజీవులు బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిరస్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే సత్యాన్ని గ్రహించాల్సి ఉంది.

సంవత్సరం	కేటాయింపులు (కోట్లలో)
2016-17	రూ.50
2017-18	రూ.175
2018-19	రూ.210
2019-20	......
2020-21	......
2021-22	......
2022-23	రూ.289
2023-24	రూ.0.10

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులను సూచించారు. అన్యాయం జరిగిన వారి పక్కన జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. 01-12-2022 తేదీ నుంచి 31-03-2023 తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి 16 కేసుల్లో 11 కేసులకు సంబంధించి రూ.4.50 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. మిగిలిన కేసులు సంబంధించి పురోగతిలో ఉన్నాయన్నారు. 2002 నుంచి 2023 వరకు 90 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఏదైనా సంఘటన జరిగితే క్షేత్రస్థాయిలో వెళ్లి పూర్తి సమాచారం తెలుసుకోని బాధిత పక్షాన నిలబడాలన్నారు. డివిజన్ స్థాయిలో సమావేశం నిర్వహించినప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై డివిఎంసి కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగం ఇస్తామని మోసం చేసే కేసులపై సీరియస్‌గా తీసుకొని కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు యాక్షన్ టేకెన్ రిపోర్టుపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సమీక్షలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫార్మెన్ అహమ్మద్‌ఖాన్, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారికత జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, మురళి, డీఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు సదాశివకుమార్, అంజనప్ప, శివశంకర్, వెంకటరమణ, డి.వెంకటరమణ, ఐ.ఈశ్వరయ్య, ఎస్.ఫరీదా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

రాయచోటి : మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఒక్కొక్కరికి మూడు ఖాతాలలో పిఎఫ్ అకౌంట్స్ ఉన్నాయని, ఒక ఖాతాగా సరిచేయాలన్నారు. 62 ఏళ్ల వయోపరిమితి పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరిగిన ధరల కనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలివ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లోకి తీసుకున్న వారిని ఆప్కాస్‌లోకి తీసుకోవాలని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒకరికి మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగబసిరెడ్డి, ఎస్.రామచంద్ర, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.అగ్గిరామయ్య, తిరుపాల్, రమణమ్మ, మంగమ్మ, సిద్దయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఆటో డ్రైవర్లకు 2 నుండి 4 నెలల వేతనాలు పెండింగులో ఉన్నాయని తెలిపారు. హెల్త్ అలవెన్స్ బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ రెండవ వారంలో కూడా వేతనాలు చెల్లించకుంటే కార్మికులు తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికుల యూనియన్ నాయకులు సి హెచ్.ఓబయ్య, కార్మికులు ప్రసాద్, సాలమ్మ, రవి ప్రకాష్, సుబ్బన్న, రవిశంకర్ పాల్గొన్నారు.

రాజంపేట వైసిపిలో ముసలం

- విభేదాలు మరోసారి బహిర్గతం
- ఎమ్మెల్యే 'మేడా'కు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట వైసిపిలో రాజకీయ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి గ్రూపుల మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్న విషయం తెలిసింది. ఎమ్మెల్యే టికెట్ విషయమైన చోటు చేసుకున్న వివాదానికి ఇంకా తెరపడలేదనిపిస్తోంది. గతంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వద్ద నిర్వహించిన పంచాయితీలో ఇద్దరి నేతల మధ్య సఖ్యత కుదిరింది. ఇద్దరూ కలిసి కార్యక్రమాలకు హాజరయ్యే వారు. పైకి కలిసిమెలిసి ఉన్నట్లుగా కనిపిస్తున్నా లోపల ఎవరికి వారు విభేదించుకుంటూ ఉండేవారని జోరుగా ప్రచారం ఉంది. తాజాగా మంగళవారం రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డికి వ్యతిరేకంగా గోడలపై పోస్టర్లు వెలిశాయి. పట్టణంలో అక్కడక్కడా 'మా నమ్మకం నువ్వే జగనన్న, కానీ రాజంపేట ఎమ్మెల్యే మేడా మీ మీద మాకు నమ్మకం లేదు' అని సంబోధిస్తూ ఇట్లు మోసపోయిన వైసిపి నాయకులు, కార్యకర్తలు' అంటూ గోడల మీద పోస్టర్లను అంటించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న నువ్వే మా భవిష్యత్తు'- మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమానికి సంబంధించిన టైటిల్‌ను వినియోగించుకొని ముఖ్యమంత్రిపైన విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ అదే సమయంలో ఎమ్మెల్యేపైన విశ్వాసం లేదంటూ నిరసన రూపంలో పోస్టర్లను అంటించడం పట్టణంలో చర్చనీయాంశమైంది. వెంటనే తేరుకున్న మేడా అనుచరులు పోస్టర్లను తొలగించారు. మేడా అనుచరుల్లో అసంతృప్తి వర్గం ఈ పని చేశారా? మేడా వ్యతిరేకవర్గం చేశారా? అన్నది తెలియాల్సి ఉంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ గ్రూపునకు చెందిన వారే ఇలా పోస్టర్లు అంటిచారనే వాదన కూడా ప్రచారంలో ఉంది.

ఎమ్మెల్యే మేడాకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు

అచ్చెన్నాయుడును కలిసిన ఖాదర్‌బాషా

ప్రజాశక్తి-రాయచోటి

అచ్చెన్నాయుడుతో ఖాదర్‌బాషా, హరిప్రసాద్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడును మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా కలిశారు. ఆయనను వారు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని అచ్చన్నాయుడు సూచించారని వారు పేర్కొన్నారు. కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత తప్పకుండా ఉంటుందన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ బిసి కార్పొరేషన్ ఛైర్మన్ గుజరాల్ పాల్గొన్నారు.

'12లోగా ఈవిఎం గోడౌన్ల వివరాలు పంపండి'

ప్రజాశక్తి-రాయచోటి

2024లో రాబోయే సాధారణ ఎన్నికల దృష్ట్యా ఈవిఎంలను భద్రపరచే నిమిత్తం గోడౌన్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు ఈ నెల 12లోగా పంపించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నూతన జిల్లాలలో ఈవిఎంలు భద్రపరచడానికి అవసరమైన గోడౌన్ల ఎంపిక అంశంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈవిఎంలు భద్రపరిచే గోడౌన్ల ఎంపికలో కమిషన్ మార్గదర్శకాలు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈవిఎంలకు రక్షణ, భద్రతకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గోడౌన్ పటిష్టవంతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసే గోడౌన్ కనీసం 10 వేల నుంచి 15 వేల చదరపు అడుగులు ఉండాలని, అందులో జిల్లాకు సంబంధించిన మొత్తం బియూలు, సియులు, వివి ప్యాట్ తదితరాలను భద్రపరచాల్సి ఉంటుందన్నారు. ఈవిఎంలను భద్రపరిచే గోడౌన్లు వర్షాలకు కారకుండా, పగుళ్లు లేకుండా పటిష్టవంతంగా, కట్టుదిట్టంగా భవనం ఉండాలన్నారు. ముఖ్యంగా ఆర్.సి భవనాలను ఎంపిక చేయాలని సూచించారు. ఎంపిక చేసే ఈవీఎం గోడౌన్లను కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలన్నారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలకు అనుకూలంగా ఉండేలా భవనం ఎంపిక చేయాలని చెప్పారు. త్వరలోనే నూతనంగా ఏర్పడిన అన్ని జిల్లాలకు ఈవిఎంలను పంపడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాన్ని ఈవిఎంలను భద్రపరచడానికి గోడౌన్ కొరకు పరిశీలించామన్నారు. దాన్ని ఇటీవలే నూతనంగా నిర్మించారని, లీకేజీలకు ఆస్కారం లేదని, భవనం పటిష్టంగా ఉందని, ఈవిఎంలను భద్రపరచడానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ భవనం జాతీయ రహదారికి పక్కనే ఉందని, నూతన కలెక్టరేట్‌కు కూడా సమీపంలో ఉందని తెలిపారు. మరో రెండు భవనాలను కూడా ప్రత్యామ్నాయంగా పరిశీలన చేశామని కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని ఈవిఎంలను భద్రపరిచే గోడౌన్ వివరాలను రేపటికల్లా కమిషన్‌కు నివేదిక పంపుతామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష

సర్వజన వైద్యం.. సర్వత్రా నిర్లక్ష్యం..

రాజంపేట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- అక్కడ సేవలన్నీ డొల్లే
- చికిత్స చేసేది శంకర్‌దాదా ఎంబిబిఎస్‌లే
- వార్డుల్లో వైద్యుల పర్యవేక్షణ అంతంత మాత్రమే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న నిరుపేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆశయం బాగున్నప్పటికీ అమలు చేయడంలో కింది స్థాయి అధికారులు విఫలమవుతున్నారని చెప్పడంలో సందేహం లేదు. ఇందుకు నిదర్శనమే రాజంపేట పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రి అని చెప్పడంలో సందేహం లేదు. అది పేరుకే సర్వ జనాసుపత్రి. సేవలందేది కొందరికే. అవును, మీరు వింటున్నది నిజమే. రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందాలంటే రాజకీయ నాయకులు లేదా, ఆసుపత్రిలో సిబ్బంది సిఫార్సు ఉంటే ఒకలా, అవేవీ లేకుంటే మరోలా రోగులకు చికిత్సలు చేస్తున్నారని ఆసుపత్రిని సందర్శించిన ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. 50 నుంచి 100 పడకల ఆసుపత్రిగా నవీకరణ చెందినప్పటికీ రోగులకు సౌకర్యాలు కల్పించడంలోనూ, చికిత్స అందించడంలోనూ, వారిని ఆప్యాయంగా పలకరించడంలోనూ సర్వజనాసుపత్రి పూర్తిగా విఫలమైనట్లు తెలుస్తోంది. రాజంపేట డివిజన్ కేంద్రం కావడంతో మండలం నుంచే కాకుండా నందలూరు, పెనగలూరు, చిట్వేలి, రైల్వేకోడూరు నుంచి ప్రతిరోజు వందలాదిమంది రోగులు, అత్యవసర కేసులు వివిధ రకాల వైద్య సేవల కోసం రాజంపేట సర్వజనాసుపత్రిని పెద్దాసుపత్రిగా పిలుచుకుంటూ సందర్శిస్తుంటారు. ఐతే.. పేరుకే పెద్ద ఆసుపత్రి గానీ, ఇక్కడ వ్యవహారమంతా డొల్లే... వార్డుల్లో ఇన్ పేషెంట్‌గా చికిత్స పొందుతున్న రోగులను వైద్యులు నిత్యమూ సందర్శించి వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీస్తూ తదనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మూడు రోజులకు ఒకసారి గానీ వార్డుల్లోని రోగులను వైద్యులు సందర్శించి పరామర్శించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. రోగులకు అందించే వైద్యం కన్నా వారితో ఆప్యాయంగా మాట్లాడి వారిలో మనో ధైర్యాన్ని నింపడంలోనే సగం జబ్బు తగ్గిపోతుందని అంటుంటారు. కానీ ఇందుకు విరుద్ధంగా ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల నుంచి నర్సులు వరకు రోగులను చులకనగా చూస్తూ, దెప్పి పొడుపుగా మాట్లాడుతూ నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వార్డులను శుభ్రపరిచే సిబ్బంది, నర్సులు రోగులను కసురుకుంటూ చిన్న చూపు చూస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలంటేనే ప్రజలలో ఆత్మన్యూనత భావం నెలకొంది.

శంకర్‌దాదా ఎంబిబిఎస్‌లే

ఎంత మంది వైద్యులు, నర్సులు ఉన్నప్పటికీ వార్డులను శుభ్రపరిచే సిబ్బందితో రోగులకు చికిత్స అందిస్తున్నారనే విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. సెలైన్ పెట్టడం, ద్రావణం అయిపోగానే మార్చడం, గాయాలను శుభ్రపరచి కట్లుకట్టడంతో పాటు సూది మందు వేయడం మిన హాయించి అన్ని పనులు పారిశుధ్య సిబ్బందిచే చేయిస్తున్నారని, వైద్యులు, నర్సులు పారిశుధ్య సిబ్బందిని శంకర్ దాదా ఎంబిబిఎస్‌లుగా వినియోగించుకుంటున్నారు.

కొరవడిన జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ

జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ కొరవడటం వలనే సర్వజనాసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాకరు. పెద్దాసుపత్రిగా, ధర్మాస్పత్రిగా పేరొందిన సర్వజనాసుపత్రికి పూర్వపు వైభవం రావాలంటే జిల్లా స్థాయి వైద్యాధికారుల పర్యవేక్షణ నిత్యం ఉండాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం

సర్వజనాసుపత్రిలోని సమస్యలపై చర్యలు తీసుకుంటాం. సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళతాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- చెన్నకృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ, రాజంపేట.

ఇన్ పేసెంట్ వార్డు

డిఎఫ్‌ఒతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

నగరవనం పనులు ప్రారంభించండి : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలో గాలివీడు మార్గంలో ఎగువ అబ్బవరం సమీపంలో 56 ఎకరాలలో నిర్మించనున్న నగరవనం పనులను త్వరితగతిన ప్రారంభించాలని సోషియల్ ఫారెస్ట్ డిఎఫ్‌ఒ నాగమణేశ్వరికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో అటవీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నగరవనంలో జాగింగ్ ట్రాక్, ప్లాంటేషన్, సోలార్ లైటింగ్, చిల్డ్రన్స్ పార్క్, బోటింగ్, కెఫ్ట్ ఏరియా, పెన్సింగ్ తదితర నిర్మాణాలపై చర్చించారు. ఇరిగేషన్, విద్యుత్, ఆర్అండ్‌బి శాఖల అధికారుల సమన్వయంతో నగరవనం పనులను ప్రారబించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారి రఘు శంకర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

పీలేరు: 2023-24 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ బిసి బాలికల గురుకుల పాఠశాల పీలేరులో 5వ తరగతి ప్రవేశానికి, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అహమద్ బాష తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరులోని తమ పాఠశాలలో అడ్మిషన్ల కోసం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 24లోగా https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రవేశపరీక్ష మే 20న జిల్లా ప్రధాన కేంద్రాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

టిబి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వ విప్

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

స్థానిక తాహశీల్దార్ కార్యాలయం వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్‌పి చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, డిఐ ఆర్డిఎ నారా సతీష్ కుమార్. ముఖ్య అతిథులుగా హాజరై రోగులకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధ్వజరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, ఏపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుని శెట్టి ప్రశాంతి రమేష్, మండల కన్వీనర్ సుధాకర్ రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురు ప్రతాప్ రెడ్డి, డిఎంహెచ్ఒ ప్రతాపరెడ్డి, సిఐ విశ్వనాథరెడ్డి, పోలా శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ తేజ, ఉప సర్పంచ్ తోట శివసాయి, మెడికల్ ఆఫీసర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'బత్యాల' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నందలూరు : నందలూరు మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం నందలూరు షాదీఖానాలో రాజంపేట టిడిపి ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు సహకారంతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు నందలూరు టిడిపి మండల అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నందలూరు మండలంలోని ముస్లిం సోదరులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న మోడీ, జగన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాయని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ విమర్శించారు. బి.కొత్తకోట ఎఐటియుసి మండల సమితి సమావేశం ఇర్ఫాన్ అలీ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసే అన్ని వ్యవస్థలపై బిజెపి పెత్తనం చేస్తోందన్నారు. అవినీతిపరులను పెంచి పోషిస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్న వారికి అండగా ఉంటుందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికలో వెల్లడైన వాస్తవాలతో అదానీ ఆస్తులపై దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజాస్వామ్యవాదులు గగ్గోలు పెడుతున్నా పార్లమెంటులో కనీసం ఒక్కరోజు కూడా దీనిపై చర్చించకపోవడం బాధాకరమని సాంబశివ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి సురేష్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు సలీంభాష, మండల కార్యదర్శి తంబయ్యశెట్టి, అధ్యక్షుడు అస్లమ్ అలీ, బాలకృష్ణ, గంగులప్ప, గఫూర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-నందలూరు

అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకల్లో భాగంగా యుటిఎఫ్ నందలూరు మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సి ఆవరణలోని నాగిరెడ్డిపల్లెహై స్కూల్లో మంగళవారం మండలస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జ్ ఎంఇఒ డి.గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పోటీ పరీక్షలకు హాజరు కావడం వల్ల పోటీతత్వం అలవడుతుంది అని తెలిపారు. అంబేద్కర్ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శ ప్రాయమని కుల, మత, వర్గ, వర్ణ, తేడాలు లేకుండా అందరూ కలసికట్టుగా సమాజంలో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా విషయ నిపుణులు ఎస్.రౌఫ్‌బాషా, స్వర్ణలత, కృపానందం, ఆనంద్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులను అంబేద్కర్ జయంతి రోజున ఎంఇఒచే అందిస్తామని యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్, రమేష్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షఫీఉల్లా, ఖాజా హుస్సేన్, శేఖర్ బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌పికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందిస్తున్నఎస్ఐ

బదిలీపై వెళ్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును జిల్లా పోలీసు అధికారులు మంగళవారం ఎస్‌పి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్ ఎస్‌పిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వృత్తిపట్ల ఎంతో నిబద్ధత కలిగిన పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు అని కితాబునిచ్చారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఆయన సూచనలు,సలహాలు విధి నిర్వహణలో తమకు ఎంతో దోహదపడ్డాయన్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహాయ, సహకారాలు అందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. వీడ్కోలు సమావేశంలో మదనపల్లె డిఎస్‌పి కె.కేశప్ప, డివిజన్ పరిధిలోని పలు మండలాల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఐఎన్‌టిఎస్ఒ'లో శ్రీచైతన్య విజయదుందుభి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ఐఎన్‌టిఎస్ఒ ఫైనల్ లెవెల్‌లో తమ విద్యార్థులు విజయ దుందుభి మోగించారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ బాలాజీ తెలిపారు. ఐఎన్‌టిఎస్ఒలో విజయం సాధించిన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బాలాజీ మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 118 మంది విద్యార్థులు బంగారు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను సాధించారని తెలిపారు. జిటిఎస్ఒలో కంబాయిగారి శరణ్యప్రియ రెండవ స్థానంలో నిలిచి బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నట్లు చెప్పారు. ఎస్‌టిఎస్ఒ లో ఎం.మున్విత సాయి నాలుగవ స్థానం, బి.జాహ్నవి ఐదవ స్థానంలో బహుమతులు పొందారని తెలిపారు. ఎంఇటిఎస్ఒలో పూజితతో పాటు మరికొంతమంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులతో పాటు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు ఫైనల్ లెవెల్ లో అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎజిఎం రమణయ్య, కో-ఆర్డినేటర్ కుటుంబరావు, డీన్ శివ శంకరయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి శ్రీరామ్, ఉపాధ్యాయులు రామ్మోహన్, వెంకటేష్, ఇనాయత్, షబ్బీర్, రెడ్డయ్య, ప్రసాద్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట అర్బన్ : మండల పరిధిలో బుధవారం 33/11కేవీ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం, మరమ్మతులు ఉన్నందున 33/11 కేవి బ్రాహ్మణపల్లె, సరస్వతి పురం, వత్తలూరు, టిజిపల్లి, కొండూరు, పెనగలూరు, బెస్తపల్లి సబ్ స్టేషన్, వీటి పరిధిలో ఉన్న పరిసర గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌శాఖ డిఇ ఎం.సురేంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగ దారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

అందరికీ ఆదర్శప్రాయుడు జ్యోతిబా పూలే : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, జడ్‌పిచైర్మన్, మేయర్

అందరికీ ఆదర్శప్రాయుడు శ్రీ మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ గిరీష అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మాండవ్య నది హై లెవెల్ బ్రిడ్జి వద్ద జ్యోతిబా పూలే విగ్రహానికి 197వ జయంతి సందర్భంగా కలెక్టర్ గిరీష పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. బ్రిటిష్ పాలనలో కుల వివక్ష ఎక్కువగా ఉండేదన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించి సంఘ సంస్కర్తగా సమసమాజ స్థాపనలో బావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే అన్నారు. సమాజంలో స్త్రీలు చదువుకోవడం ఎంతో ఆవశ్యకమని గుర్తించి ఆ దిశగా మొదట తన సతీమణికే విద్యను నేర్పించి మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పూలే తీర్చిదిద్దారన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, బిసి సంఘం నాయకులు విజయభాస్కర్ లు జ్యోతిబాపూలే జయంతోత్సవ వేడుకలలో మాట్లాడారు. పట్టణంలోని మాండవ్య నది హై లెవెల్ బ్రిడ్జి వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, బిసి నాయకులు విజయభాస్కర్, జిల్లా అధికారులు, బిసి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. **సిపిఎం ఆధ్వర్యంలో...** మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా స్థానిక లక్ష్మీ థియేటర్ దగ్గరలోని పూలే విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటి సభ్యులు ఎ.రామాంజులు, కార్పొరేషన్ డైరెక్టర్ మల్లూరు రెడ్డివరప్రసాద్, ఆర్‌టిసి రామాంజులు, రైతుసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కె.నాగబసిరెడ్డి, రామచంద్ర, సిఐటియు అగ్గిరామయ్య , తిరుపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త ఉద్యమకారుడు, సంఘ సేవకుడు సంఘసంస్కర్త జ్యోతిరావుపూలేను మహాత్మా గాంధీ, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లాంటి మహనీయులు స్ఫూర్తిదాతగా స్వీకరించారని గుర్తు చేశారు. **రైల్వేకోడూరు :** పూలే 196వ జయంతిని పురస్కరించుకొని పట్టణ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నూతనంగా జ్యోతిరావుపూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప మేయర్ సురేష్‌బాబు, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీ యేసురత్నం హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధ్వజరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రాజు పాల్గొన్నారు. **నందలూరు :** ఆర్‌అండ్‌బి బంగ్లా సర్కిల్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలవేసి, పాలాభిషేకంతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి నాయకులు సమ్మెట శివప్రసాద్, తాటి సుబ్బరాయుడు, జంగంశెట్టి సుబ్బయ్య, పోతురాజు మస్తానయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, సభ్యులు దాసరి నరసింహులు, గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, షేక్ మహమ్మద్ అలీ,చామంచి పెంచలయ్య, గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, చల్లా నాగేంద్ర, కానుగుర్తి వెంకటయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపిడిఒ శంకరయ్య, ఎంఇఒ రెడ్డిశేఖం, యుఎ.ఒ.థామస్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాలిక్, బాస్ సచిన్, సంకు సబ్జి, పవన్ రాయల్, నక్కామహేష్, దినేష్, ఉబేదుల్లా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **వీరబల్లి :** వెలుగు కార్యాలయం ఆవరణంలో వైసిపి బిసి సెల్ నాగభూషణం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **రాజంపేట అర్బన్ :** బడుగు బలహీన వర్గాలకు మార్గదర్శి ప్రదాత జ్యోతి బాపూలే అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ తెలిపారు. పూలే విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉపేంద్ర, నాని పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, కృష్ణయ్య, వెంకటస్వామి, పెంచలయ్య, బసయ్య, హరికుమార్, వెంకటయ్య, ఆచారి, రమణ, గంగాధర పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఉన్న జ్యోతిబాపూలే విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్ సేన అన్నమయ్య జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుబాష్, బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాదేషా వల్లి, రాష్ట్ర పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, బాస్ పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రబల్లి మల్లికార్జున, మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి అనంద్, కార్యవర్గ సభ్యులు పాటూరి ప్రసాద్, తుమ్మల రవికుమార్, గుండ్లూరు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** స్థానిక నీరుగట్టువారిపల్లె లో బిసిహెచ్‌పిఎస్ అధ్యక్షులు బోడం రాజశేఖర్ ఆధ్వర్యంలో మహాత్మ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ గత 15 ఏళ్ళగా కృషి చేస్తూ, నాలుగేళ్ల క్రితం విగ్రహం తీసుకు వచ్చి ప్రభుత్వ లంచనాలతో ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు మెదలు పెట్టిన నేటి వరకు విగ్రహం ఏర్పాటు చేయడానికి మాత్రం ఏ రాజకీయ పార్టీ కానీ సంపూర్ణ సహకారం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమం లో ఎపి బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయం : 'గడికోట'

ప్రజాశక్తి-చిన్నమండెం

వాల్మీకిపురం : గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

జగన్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలో దేవగుడిపల్లె, కురవపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా సీఎం జగన్ పాలన అందిస్తున్నా రన్నారు. విప్లవాత్మక మార్పులుతో, వ్యవస్థలలో మార్పులు తెచ్చి ప్రజల వద్దకే పాలనను తెచ్చారన్నారు. జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలన ఆదర్శంగా, పారదర్శకంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమృతమ్మ, ఎంపిటిసి రమణ, బాబు రెడ్డి, భాస్కర్ రెడ్డి, జయశంకర్ రెడ్డి, రఘునాథ రెడ్డి,చంద్ర, రాజా, కృష్ణారెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మండల ఉపాధ్యక్షుడు ఎజాస్ అలీ ఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుచుక్కా అంజనప్ప, కో-ఆప్షన్ సభ్యుడుగౌస్ సాబ్, ఎంపిటిసిలు రమేష్ సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** నవరత్నాల పథకాల ద్వారా గత నాలుగేళ్లలో రాష్ట్రంలో పేద ప్రజలకు వైసిపి ప్రభుత్వం నేరుగా దాదాపు రూ.2లక్షల కోట్లు అందించడం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తి బిసి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, ఫారుఖ్, చెంగల్ రెడ్డి, మెంబర్ శీన పాల్గొన్నారు.

నేడు చింతపర్తిలో గడప గడపకూ.. బుధవారం ఉదయం 6గంటలకు చింతపర్తి సచివాలయం పరిధిలోని చింతపర్తి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతి విద్యార్థికీ జెవికె కిట్లు

- ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందేటట్లు చూడాలని ఎపి మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి లోని మోడల్ స్కూల్ ను సందర్శించి మండలంలోని జెవికె కిట్లను మోడల్ స్కూల్లో భద్రపరిచి మండలంలోని అన్ని పాఠశాలలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ నుంచి అన్ని పాఠశాలలకు ఆయా ప్రధానోపాధ్యాయులు జెవికె కిట్లు, యూనిఫామ్, బూట్లు నోటపుస్తకాలు, విద్యా సామగ్రి విద్యార్థులకు జూన్ లోపల అందించాలన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లా అబ్జర్వేజర్‌గా నియమించారని పరీక్షలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ చక్రనాయకుడు ప్రిన్సిపల్ రేఖ ఐఐటి ఉపాధ్యాయులు జనార్ధన, ఎంఐఎం కో-ఆర్డినేటర్ రామాంజనేయులు, సిఆర్‌పిలు రామ్మోహన్, శశికళ, సుభాషిని, ఉపాధ్యా యులు, రాజ్‌కుమార్, ప్రసాద్, మురళీనాయక్, విజయ్‌కుమారి, విజయ, సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :** బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంగా భద్ర పరచిన జెవికె కిట్స్‌ను ఆర్జెడి వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న, ఎంఇఒ చక్రే నాయక్, సిఆర్‌పిలు, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వనరులు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న విద్యా కానుక' కిట్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా జెవికె-4 స్పెషల్ ఆఫీసర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యా కానుక లోని వస్తువులను నిల్వజేసే మండల కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన పరిశీలించిన వాటిలో గాలివీడు, పెద్దమండ్యం, తంబళ్లపల్లి మండల నిల్వ కేంద్రాలున్నాయి. జగనన్న విద్యా కానుక వస్తువులను నిల్వ చేయడానికి మండల విద్యాశాఖ అధికారులు గుర్తించిన నిలవ కేంద్రాలు భద్రతాపరంగా సురక్షితమైనవేనా, వర్షాకాలంలో వస్తువులు తడిసే అవకాశం ఉందా వంటి విషయాలను పరిశీలించారు.

ఇఫ్తార్ విందులో ఎంపిపి

ప్రజాశక్తిద-పుల్లంపేట

మండల కేంద్రమైన పుల్లంపేటలో మంగళవారం నియోజకవర్గం సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, మండల ఎంపిపి ముద్ద బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్‌ను పురస్కరించుకొని భారీ ఎత్తున జరిగిన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ ఇందులో రెండువేల మంది ముస్లిం సోదరులు పాల్గొని విందును స్వీకరించారు. కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 16,17,18వ తేదీలలో తిరుపతిలో జరిగే ఐఎస్‌టియు అఖిల భారత జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఐఎయు నాయకులు పోరెడ్డి రమణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం బసినికొండలో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, కార్మిక హక్కుల కాలరాతకి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయలు, చలపతి, గణేష్, వెంకటేష్, కృష్ణప్ప, సాయి, కళ్యాణ్, నారాయణ పాల్గొన్నారు.

బిపి, షుగర్‌కు ప్రత్యేక వైద్యున్ని నియమించాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని మంగంపేట గ్రామ ప్రజలకు బిపి, షుగర్ వ్యాధులకు ప్రత్యేక వైద్యులను నియమించి ఉచిత మందులు పంపిణీ చేయాలని రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి మంగళవారం ఎపిఎండిసి ఎండి వెంకట్ రెడ్డిని కలిసి కోరారు. మంగంపేట పరిధిలోని కాపు పల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలను తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ కార్డులు లేక అవస్థలు పడుతున్నారని, కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి : జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జడ్జి కె.లత

జాతీయ లోక్ అదాలత్‌లకు సంబంధించి ప్రతి రోజు ప్రీ సిట్టింగ్స్ నిర్వహించడం జరుగు తుందని, వాటిని కక్షీ దారులు వినియో గించు కోవాలని మండల లీగల్ సర్వీ సెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. మంగళవారం స్థానిక కోర్టులో ఆమె పోలీస్ అధికారులతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో మే నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడునని, అందులో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కారం కొరకు కృషి చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో మన్నూరు సిఐ కె.పుల్లయ్య, పుల్లంపేట ఎస్ఐ బి.సుబ్బారెడ్డి, ఎఎస్ఐ శంకర్ నాయక్, పెనగలూరు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కోర్టు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : మెగా ప్రజాసర్వేలో వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ.రమణారెడ్డి

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు - నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి విశేషంగా స్పందన వస్తోందని వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెలో నిర్వహించిన మెగా ప్రజా సర్వే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్ రెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు, ఉపసర్పంచ్ మహమ్మద్‌రఫీలతో కలసి ప్రజాసర్వే నిర్వహించారు. ప్రజా సర్వేలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై, జగనన్న ప్రభుత్వం పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించి, వారి అభిప్రాయం మేరకే నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్‌ను ఇంటికి అంటిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకటరమణారెడ్డి, కొండగాళ్ల రమణ, నారాయణ, శ్యాం ప్రసాద్, శ్యామల, ముబారక్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ఆదేశాల మేరకు మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి రెడ్డిహరి ఆధ్వర్యంలో ఒకటవ సచివాలయ పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒకటవ సచివాలయ కన్వీనర్లు చాంద్ బాషా, అంజమ్మ గృహసారదులు జనార్ధన్, సుబ్బు, సాదిక్, సురేంద్రరెడ్డి, అహ్మద్‌బాషా, ఆదం, కాలేషా, గిరి, రాజు, సయ్యద్ బాషా, కలావతి, అనిత, శ్రీజ, లలిత, వాలంటీర్లు, పూల శీనా, షఫీ, సుభాష్, అనిత, శిల్పా , షబ్రీన్, సరిత పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్ఎ. కరీముల్లా అన్నారు. మదనపల్లి మునిసిపాలిటీ 14వ వార్డు లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలను ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షబానా, కన్వినర్లు, గృహ సారదులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సింపోజియం'లో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులు

మదనపల్లె అర్బన్ : శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీస్ రాయచోటి కళాశాలలో వన్డే నేషనల్ లెవెల్ టెక్నికల్స్ సింపోజియం డిపార్ట్మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సైన్స్ నిర్వహించారు. మదనపల్లి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులు సింపోసియం లో పాల్గొన్నారు. ఎ.అమృత, అంజుమ్ రెహబార్, పియం.శృతి, వైష్ణవి, తనుశ్రీ, సంధ్య, సానియా మెహక్, సమీర్. వివిధ సబ్జెక్టులలో బహుమతులు సాధించారు. సింపోసిఎంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల అధ్యక్షులు నాగమల్లా రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్‌ఎస్. రామలింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సతీష్ బాబు, హెచ్‌అండ్ఎస్ డిపార్ట్మెంట్ హెచ్ఒడి విజయ భాస్కర్ నాయుడు, అమర్నాథ్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

కలకడ ఎఎస్ఐగా మోసెస్

ప్రజాశక్తి-కలకడ

ఎఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మోసెస్

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ గా మోసెస్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో వాయల్పాడు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ, కలకడకు బదిలీపై వచ్చినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎఎస్ఐ మాట్లాడుతూ బదిలీపై ఇక్కడికి రావడం సంతోష దాయకమని, వృత్తిని నిష్పక్షిపాతంగా నిర్వహించి, ఎల్లవేళలా ప్రజాసేవలో ఉంటానని అన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెద్దమండ్యం లోని రైతులకు మంగళవారం పెరటి కోళ్ల పెంపకం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అంశాల మీద ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి డాక్టర్ శ్రీకాంత్ మామిడి, చిరు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కెవికె పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్.నవీన 500 కోళ్లతో పెరటి కోళ్ల యూనిట్ పెట్టడానికి అవసరమైన ఖర్చు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌రావు, పెద్దమండ్యం సర్పంచ్ బాషా, ఎంపిటిసి జయరామ్, శాస్త్రవేత్తలు మాధురి, పీరు సాహెబ్, పశువైద్య అధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : 'మేడా'

వీరబల్లి : మహిళాభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణంలో జరిగిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు గతప్రభుత్వంలో దగాకు గురయ్యాయని, ఈప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేసిందన్నారు. మండలంలోని మహిళా సంఘాలకు మూడో విడతలో రూ.2.53 కోట్ల రుణాలను పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేసిందన్నారు. మహిళా స్వావలంబన కొరకు అమ్మ ఒడి, సున్నావడ్డీ, ఆసరా, చేయూత, చెదోడు వంటి పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆసరా మెగాచెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ బండి సత్యనారాయణ, తాహశీల్దార్ తులసమ్మ, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, ఎపియం ఖాదర్ వలి, ఎస్ఐ రహీముల్లా, జడ్పిటిసి శివరాం, ఉమామహేశ్వరరాజు. సర్పంచుల అధ్యక్షుడు నాగిరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పుల్లంపేట :మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆర్.గొల్లపల్లి గ్రామానికి చెందిన గాడి శంకర్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కూతురు ఉన్నారు. వివరాల్లోకి వెళితే..గుర్తుతెలియని వాహనం ఢీకొని శంకరరెడ్డి(58) మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న పాత నేరస్తుడిని రాయచోటి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం రాయచోటి పోలీస్‌స్టేషన్ సిఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శ్రీ సత్య సాయి జిల్లా గొకనపల్లి కు చెందిన షేక్ దర్బార్ వలీ (35) పార్క్ చేసిన బైక్‌లను చోరీకి పాల్పడుతుండే వాడని తెలిపారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీధర్ పర్యవేక్షణలో సోమవారం గాలివీడు రోడ్డు లోని పొదలపల్లి గ్రామం క్రాస్ రోడ్డు వద్ద ముద్దాయిని చాకచక్యంగా అదుపులో తీసుకున్నారు. పట్టుకొని విచారించగా 8 బైక్ లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. నిందితుడి నుంచి రూ.4 లక్షల రూపాయల విలువ గల ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దర్బార్ వలీ పై గతంలో రాయచోటి, కదిరి, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. ముద్దాయిని చాకచక్కంగా అదుపులో తీసుకొని విచారించి వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర వహించిన రాయచోటి పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, సబ్ డివిజన్ క్రైమ్ పార్టీ సిబ్బంది మల్లికార్జున, బర్కతుల్లా,మహేంద్ర నాయుడు లను డిఎస్‌పి శ్రీధర్ అభినందించారు.